మాధవరావుతో ఇతనెప్పుడూ మాట్లాడలేదు. కలుసుకున్నప్పుడు వొకర్నిచూసి వొకరు నవ్వుకోడం, మందహాసం ప్రకటించడంవరకే వారి పరిచయం.

ఆ రోజు ఇంటిదగ్గరనుంచి మనియార్డరొచ్చింది. గది అద్దె నాన్సీద్వారా పంపుదామని పర్సులోంచి లెక్కతీశాడు. మరో రెండురూపాయిలనోటు చేతులోకొచ్చింది. 'నాన్సీ'ని పిల్చాడు. వొచ్చింది. తలుపు జేరవేశాడు. కిటికీలోంచి అటూ యిటూ చూశాడు. నోట్లు చూపాడు. నాన్సీ కళ్ళు పెద్దవి చేసింది. భయంతో తలవూపింది. చెయ్యి పైకి పెట్టమన్నాడు. చేతులో చీపురు గిరవాటెట్టి గది అవతలతలుపు తెరిచి వొక్కపరుగున వెళ్ళింది నాన్సీ.

అతనికి నవ్వొచ్చింది. ఎందు కట్లా భయపడుతుంది? ఇంకా పిల్లకి పెళ్ళికాలేదు. అలిమేలు ద్వారా అదికాస్తా తెలుసుకున్నాడు. పెళ్ళికాకపోతే? ఏదో సంశయం, పెనుగులాట, వున్నప్పుడే ఆడది సిగ్గు ప్రకటిస్తుంది. ఇష్టంపట్ల అయిష్టం ప్రకటించి, అవతలవాడికి అందకుండా దూరమై, వేటాడబడటం స్త్రీనైజం. అందుకు సృష్టి సమకూర్చిన ఆయుధం సిగ్గు. 'నాన్సీ' చేష్ట అతన్ని కార్యానికి పురిగొల్పింది. ఇదివరలో అద్దె అలిమేలుద్వారా పంపేవాడు. అలిమేలుద్వారా పంపడంఎందుకో? అతనే స్వయంగా పాపన్నప్పగారికి ఇవ్వొచ్చుగా. ఈ కాస్త పనికీ మధ్యవర్తి వొకరా? డబ్బుతో కూడుకొన్న వ్యవహారంలో కుటిలత్వం తప్పదు. ఈసారి నాన్సీద్వారా పంపుతేనేం? కొబ్బరిచెట్టుకింద బట్టలు ఆరబెడుతోంది. తాడుమీదికి చేతులెత్తినప్పుడు. కండలపై నీడలు స్ఫుటంగా పడుతున్నాయి.

ఆమె వొంగివూడుస్తుంటే బల్లకింద ఏదో పడిపోయి నట్లు, మోకాళ్ల మీదపడి, వొంగి ఆమె చేతిగాజులు పరీక్షగా చూశాడు. కొంచంగా చప్పుడుచేస్తాయి, రంగుగాజులగొట్టం తిప్పినట్లు. మరోటిచూశాడు - మెడలో ఎర్రపూసలతాడు.

“కొన్నావా?”

అవునన్నట్లు తలవూపింది.

“ఎక్కడ?”

నవ్వుతుందేం?

“మాట్లాడవేం?”

ఆమూలకి వెళ్ళింది. వెనకభాగం - చీరలోంచి పిరుదుల ఆకృతి కనబడుతోంది - తను ఎగ్జిబిషన్‌లో చూసిన శిలా ప్రతిమకి మల్లే.

“ఎప్పుడేనా సినిమాకి వెళతావా?”

తలవూపుతుంది.

“వెడతావా?”

బైటకి వెళుతోంది. సంజ్ఞ చేసి నిలిపాడు.

“ఇదిగో రెండురూపాయిలు-సినిమాకెడతావనిచ్చాను. మీ అమ్మకి చెప్పావా? ఇంకెప్పుడూ అల్లాచెయ్యకు.”

అమ్మో - అన్నట్లు కళ్లు పెద్దవిచేసింది. అతని కంఠం బొంగురుపోయింది - ఎండినట్లు మాట తడబడుతోంది. రూపాయిలు చేతులోపెట్టి, వేళ్ళు మడిచి నొక్కాడు.

“ఫరవాలేదులే - ఏదేనా కొనుక్కో.”

తీసుకుంది. “అమ్మయ్య” అనుకొన్నాడు.

లోంచి చూస్తున్నాడు – మోహన్‌బాబు. అతని గుండెలు వేగంగా కొట్టుకుంటున్నాయి. మధ్య తన కెందుకు బాధ. శరీరంపై తనకెట్లాంటి యాజమాన్యము లేకపోవడం చిత్రంగా వుంటుంది. మనుషుల అలజడి — రెండోవ్యక్తి గదిలోకి వెళ్ళాడు. అతను మాధనరావు. రెండుమూడు నిముషాలలో అలిమేలు ఇవతల కొచ్చేసింది. అమ్మయ్య అనుకొని నిట్టూర్చాడు మోహన్‌బాబు. అలిమేలు వెళ్ళింది. మాధనరావు గది గడియపెట్టిన చప్పుడైంది. మోహన్‌బాబు పడుకున్నాడు. కాలం జరగదు. ఏమీ జరగదు. విసుగుపుడుతుంది. జీవితం పట్ల నిష్కారణంగా విసుగుపుడుతుంది. ఔరంగజేబుని గురించి ఆలోచించాడు. అతని కొడుకులు, వారి ప్రేమకలాపాలు, సింహాసనంకోసం కొట్లాటలు, యుద్ధాలు. ముమ్‌తాజ్‌బీగమ్ తాజ్‌మహల్‌లో శాశ్వతంగా పవ్వళించింది. జీవితంలో ఏమి చూసిందో మృత్యువులోనూ అదే – విసుగు

ఓ గంట కాలక్షేపం చెయ్యడం చేతకాని యీ మనుషులు అమరత్వాన్ని కోరతారెందుకో! వేదాంతులు, వారి సిద్ధాంతాలు – పరమాత్మలోంచి పుట్టుకొచ్చాడుట యీ మనిషి – మళ్ళా పరమాత్మలోకే వెడతాడుట – ఆ తలుపు తెరుచుకుని, యీ చీకట్లో క్షణంవుండి, మళ్ళా ఆ రెండో తలుపు తెరుచుకుని పరమాత్మలో ఐక్యమై అమరత్వం పొందుతాడుట! ఎంతవెర్రి – కాలక్షేపంకాని వేదాంతుల కల్పన యీ అమరత్వం.

లేచేటప్పటికి నాలుగైంది. బైటకెళ్ళి టీ త్రాగి వొచ్చాడు. సాయంత్రం కనుక్కోడానికి నాసీ రాలేదు.

జ్వరం వొచ్చిందిట. అలిమేలే వొచ్చింది. అన్నీ సర్ది, కారియర్ తీసుకెళ్లింది. ఐదు దాటింది. ఆరవుతోంది. మాధవరావు ముస్తాబై, బైటకెళ్లాడు. తెల్ల పాంటు, లోపలకి మడిచిన చొక్కా, బెల్టు, మధ్యపాపిడతీసి వెనక్కిదువ్విన క్రాపింగు- బాగానేవ్వుంటాడు. బత్తాయిపండురంగు. ఆరకం పచ్చదనం తన కిష్టంలేదు. రెబ్బతిని, కాస్త వాడిలి, నలిగిన బత్తాయి పండులా, జాను దనడూ, రంగూను.

మోహన్ బాబుకూడా బైలుదేరాడు. గూడకట్టు, లాల్చి, పైన తువ్వాలు - నిరాడంబరంగా వుండాలి వస్త్రధారణ. తెల్ల ఖద్దరు బాగుంటుంది. మాధవరావు వెనకాలే నడుస్తున్నాడు. అసలు అల్లా వెళ్ళాలి అనుకోలేదు. కాళ్ళు అటు తీసుకెడుతున్నాయి. మళ్ళీపుతిరిగాడు. ఇతనూ తిరిగాడు.

అదేదో కాఫీహోటల్లోకి వెళ్ళాడు మాధవరావు. ఇతను వెళ్ళలేదు. దూరంగా చెట్టుకింద నిలబడి, మేడమీాదనుంచి వొస్తున్న రేడియోపాట వింటున్నాడు. మాధవరావు బైటకొచ్చాడు. అతనిచేతులో పొట్లంవుంది. టిఫిన్ పాకేజి. మళ్ళీ ఇద్దరూ నడుస్తున్నారు. చీకటి పడుతోంది. ఇంక విద్యుత్ దీపాలు వెలగడం తరవాయి. ఆ గుమ్మంముందు నిలిచాడు మాధవరావు. తలుపుతీసింది. తనెరుగున్న మొహమే. అలిమేలు. గుమ్మందాటి బైటకొచ్చింది మరో మొహం తలుపు సందులోంచి కనబడింది. ఆరోజున సినిమాలోచూసిన వజ్రాలదుద్దులు ధరించిన అమ్మాయిలాగుంది. లాగు లేదు, చొక్కా లేదు — ఆ అమ్మాయే!

